సాక్షి
జనగామ

సోమవారం । 26 । ఆగస్టు । 2024

'సాక్షి' ఫోన్‌ఇన్



జనగామ: గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు, డెంగీ, చికున్‌గున్యా ప్రబలుతున్నాయి. జ్వరాలు పెరిగి ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరం నుంచి కోలుకున్న తర్వాత ఒంటి నొప్పులతో నీరసించిపోతున్నారు. ఈనేపథ్యంలో సీజనల్ వ్యాధుల వైద్యం, సందేహాలు, వైద్య సలహాల కోసం జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధతో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వైద్యం, వైద్య సలహాలు, సూచనలు చేయడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :
9705346396, 8121226396
సమయం : మంగళవారం (ఈనెల 27న)
ఉదయం : 10:30గంటల నుంచి 11:30గంటల వరకు

న్యూస్‌రీల్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనదారులు సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్‌సెర్చ్‌ను నిర్వహించారు. స్థానిక డీసీసీబీ బ్యాంకు, బస్టాండ్ వెనుకాల కాలనీలో తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 30 వాహనాలను గుర్తించారు. అనంతరం ఆయా కాలనీలకు చెందిన వారితో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనల్ని పాటించాలని, మైనర్‌లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే అందుకు తల్లిదండ్రులు, బైక్ ఓనర్లు బాధ్యులవుతారన్నారు. ఎవరైనా గంజాయి తాగిన, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘన్‌పూర్ సీఐ జి.వేణు, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రావణ్‌కుమార్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'అంబేడ్కర్'డిగ్రీ సెకండ్ సెమిస్టర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

దేశాయిపేట: డా.బీ.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023–24 విద్యాసంవత్సరం డిగ్రీ అడ్మిషన్ పొందిన సైన్స్ విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ ప్రాక్టికల్స్ ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 25 వరకు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సీకేఎం ప్రభుత్వ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్.అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

బీసీలు సంఘటితం కావాలి

కాజీపేట: హక్కుల సాధన, రాజ్యాధికారం కోసం బీసీలు మలిదశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సంఘటితం కావాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యాన నిర్వహించిన బీసీల సమర శంఖారావం, మేథోమదనం సదస్సులో ఆయన మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుచేయకుంటే రానున్న రోజుల్లో వరంగల్‌లో భూకంపం పుట్టిస్తామన్నారు. తాను బతిమిలాడి సీటు తెచ్చుకోలేదు.. బెదిరించి సీటు తెచ్చుకున్నానని స్పష్టం చేశారు. బీపీ మండల్ మనవడు సూరజ్‌యాదవ్ మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా పోరాడితే రాజ్యాధికారం దక్కడం పెద్ద సమస్యకాదనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీసీలను విస్మరించి అగ్రకులాలకు పెద్దపీట వేసే పార్టీలకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో 'సామాజిక న్యాయమే బీసీ నాదం–బీసీ వాదం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ డీఆర్‌డీఏ పీడీ చిరంజీవులు, బీసీ నాయకులు వండ్లకొండ వేణుగోపాల్, డాక్టర్ వినయ్‌కుమార్, సాంబారి సమ్మారావు, రాజయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో అధికారులు

హన్మకొండ కల్చరల్ : వరంగల్‌లోని శ్రీభద్రకాళి దేవాలయాన్ని ఆదివారం రెండు రాష్ట్రాల ఆదాయపన్ను శాఖ అధికారి ఆనంద రాజేశ్వర్, సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్ కొర్ర ధర్మ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన అనంతరం అర్చకులు వారికి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ఏర్పాట్లను ఈఓ. శేషభారతి పర్యవేక్షించారు.



దేవాలయంలో ఐటీ అధికారి ఆనంద రాజేశ్వర్



ఇంద్రధనుస్సు కనువిందు

ఏడు రంగులు కలబోసిన సప్తవర్ణ శోభితంగా ఇంద్రధనుస్సు ఆదివారం పట్టణ ప్రజలను కనువిందు చేసింది. సాయంత్రం మబ్బులతో కూడిన చిరు జల్లుల పలకరింపు నడుమ చంద్రాకారంలో కనిపించిన ఇంద్ర ధనుస్సును పట్టణ ప్రజలు చూసి మంత్రముగ్ధులయ్యారు.

-జనగామ

ఊపిరి పోస్తున్నారు..

- అత్యవసర సమయంలో '108' సిబ్బంది సేవలు
- అంబులెన్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయం
- సంవత్సరకాలంగా 875 శిశువులకు సేవలు



అంబులెన్స్‌లో నవ జాత శిశువుకు సేవలు

జనగామ: నెలలు నిండకుండా.. తక్కువ బరువుతో అనారోగ్యంతో జన్మించే నవజాత శిశువులను నియోనాటల్ (108) అంబులెన్స్ సంజీవనిలా ఊపిరి పోస్తుంది. శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిన నియోనాటల్ అంబులెన్స్ సేవలకు ఏడాది పూర్తయింది. సర్కారు దవాఖానాల్లో ప్రసూతి కాన్పు సమయంలో జన్మించిన నవ జాత శిశువులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు తరలించే క్రమంలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య పరీక్షలు అందించే వెసులుబాటును ఇందులో కల్పించారు. గతేడాది ఆగస్టు 25న రాష్ట్రంలో 108 నియోనాటల్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

నియోనాటల్ అంబులెన్స్ తల్లి గర్భంలా నవ జాత శిశువులకు ఊపిరి పోస్తోంది. ఇందులో అత్యాధునిక టెక్నాలజీ సేవలను ఏర్పాటు చేశారు. శిశువులను మెరుగైన వైద్య పరీక్షలకు తరలించే క్రమంలో అంబులెన్స్‌లో టెంపరేచర్‌ను మెయింటనెన్స్ చేస్తూ... వార్మర్ సహాయంతో శిశువు తల్లి గర్భంలో ఎలా ఉంటారో అలాంటి సేవలు అందిస్తూ తీసుకువెళతారు. జిల్లాలోని 108 నియోనాటల్ అంబులెన్స్ ఎందరో నవజాత శిశువులకు ఊపిరి పోసి.. సంజీవనిగా పేరు తెచ్చుకుంది. ఇందులో బేబీ వార్మర్, మల్టీ పారామానిటర్, సిరంజి పంప్, వాల్యూమ్ ఇన్ఫ్యూజియన్ పంప్, సెక్షన్ ఆపరేటర్, వెంటిలేటర్, ఆక్సిజన్, గ్లూకో మీటర్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. ప్రత్యేక శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలెట్లు ఉంటారు.



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

సిబ్బంది వేడుకలు

నెల వారీగా కేసుల వివరాలు..

గత సంవత్సరం ఆగస్టు నెలలో (2023) 2, సెప్టెంబర్‌లో 14, అక్టోబర్‌లో 9, నవంబర్‌లో 36, డిసెంబర్‌లో 69, జనవరి (2024)లో 94, ఫిబ్రవరిలో 103, మార్చి లో 108, ఏప్రిల్‌లో 81, మేలో 91, జూన్‌లో 96, జూలైలో 102, ఆగస్టు నెలలో 74 కేసులు కాగా మొత్తం 875 మందిని వివిధ ఆస్పత్రులకు తరలించారు.

గతేడాది నుంచి 2024 ఆగస్టు వరకు 875 మంది నవజాత శిశువులను మెరుగైన వైద్య పరీక్షల కోసం హైదరాబాద్, వరంగల్‌కు తీసుకు వెళ్లారు. ఈ అంబులెన్స్ సేవలు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు.

అమ్మలా కాపాడింది..



ఈ ఏడాది జూలై 6న మా పదిరోజుల పాపకు అనుకోకుండా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగింది. రక్తంలో ఇన్ఫెక్షన్ వచ్చిందని డాక్టర్ చెప్పారు. వెంటిలేటర్ అత్యవసరం ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. వెంటనే 108కి ఫోన్ చేయగా, సమయానుకూలంగా నియోనాటల్ అంబులెన్స్ మా వద్దకు చేరుకుంది. డాక్టర్ చెప్పిన విధంగా అత్యవసర వైద్యం అందిస్తూ సురక్షితంగా ఎంజీఎంకు తీసుకువెళ్లారు. అక్కడ 10 రోజుల పాటు వెంటిలేటర్‌పై చికిత్స పొందిన తర్వాత, ఆరోగ్యంగా కోలుకున్న పాపతో క్షేమంగా ఇంటికి చేరుకున్నాం. మా పాప ప్రాణాలు కాపాడిన అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు.

\- వాజిద్, జనగామ

అదృష్టంగా భావిస్తున్నాం..



నియోనాటల్ అంబులెన్స్‌లో సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇందులో పని చేసే ప్రతిఒక్కరూ అంకిత భావంతో ఉన్నారు. నెలలు నిండకుండా, బరువు తక్కువతో జన్మించే నవ జాత శిశువులను తరలించే క్రమంలో శక్తికిమించి పని చేస్తున్నారు. లబ్ధిపొందిన వారి ఆశీర్వాదం మాకు కొండంత బలం అనిపిస్తుంది.

\- మంద శ్రీనివాస్, 108, 102 అంబులెన్స్ జిల్లా మేనేజర్

ప్రాణం పోశారు...



జూన్ 21న ప్రసూతి కోసం జనగామ ఎంసీహెచ్‌కు వచ్చాం. నెలలు నిండక ముందే (7 మాసాలు) కవలలు జన్మించారు. ఇద్దరిలో ఒకరు శ్వాస సమస్యతో ఇబ్బంది పడ్డారు. వైద్యుల సూచన మేరకు నియోనాటల్ అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పాప గుండె కొట్టుకునే వేగం తగ్గి, చర్మం నీలి వర్ణంలోకి మారి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వెంటనే స్పందించి పాపకు సీపీఆర్ చేస్తూ... కృత్రిమ శ్వాస అందిస్తూ ఎంజీఎంకు తీసుకువెళ్లారు. ఎంజీఎంలో 41 రోజుల పాటు పాప వెంటిలేటర్‌పై చికిత్స పొంది, కోలుకుని ఇంటికి చేరుకున్నాం. నియోనాటల్ అంబులెన్స్, అందులో ఉన్న టెక్నీషియన్ల సేవలతో పాప ప్రాణం దక్కింది.

\- కొండబోయిన మనూషసోమయ్య,
మరిపడగ, గుండాల మండలం, యాదాద్రి

'ఓపీఎస్' అమలు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

జనగామ రూరల్: సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తుంటే యూపీఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మరో నాటకానికి తెరలేపిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అకుల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 28 ఉద్యోగులు పాలిట శాపంగా మారిందన్నారు. ఉపాధ్యాయులకు గతంలో ఉన్న ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలం కాగా ఉద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. యూపీఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చేది లేదని భవిష్యత్‌లో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, వెంకట్, శ్రీహరి, యాదవరెడ్డి, కనకయ్య, ఆగయ్య, శ్రీనివాస్, ఉప్పలయ్య, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌ఏఎస్'లో సత్తా చాటాలి

- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్
- నవంబర్ 19న దేశ వ్యాప్తంగా ఎగ్జామ్
- జిల్లాలో 9,340 మంది విద్యార్థులు
- కలెక్టర్ చొరవతో ప్రత్యేక తరగతులు



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రామ్

జనగామ: తరగతి గదిలో విద్యార్థి సామర్థ్యంతో పాటు విద్యావ్యవస్థ పురోగతిని తెలుసు కునేందుకు జాతీయ స్థాయిలో జరగబోయే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్)లో జనగామ ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ప్రస్తుత తరుణంలో పిల్లల్లో సామర్థ్యం, అభ్యసన స్థాయి, జ్ఞాన సముపార్జన ఎలా ఉందనే దానిపై ఈ పరీక్ష ఎంతగానో ఉపయోగపడనుంది. 2021లో నేషనల్ లెవల్‌లో జరిగిన పరీక్షలో జనగామ జిల్లా చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. ఈ సారి జాతీయ స్థాయిలో టాప్‌లో నిలవాలనే సంకల్పంతో కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రత్యేక ఫోకస్ సారించి.. విద్యాశాఖ అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్‌లో విద్యాబోధన, పిల్లల్లో సామర్థ్యం తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ మూడేళ్లకోసారి ఎంపిక చేసిన పాఠశాలల్లో జాతీయ స్థాయిలో ఎన్‌ఏఎస్ కార్యక్రమంలో సర్వే పేరిట టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థుల అంచనా సామర్థ్యాలను తెలుసుకోవడంతో పాటు వారిలో ఉన్న లోపాలను గుర్తించి, నివారణ చర్యలు తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. గత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాల ద్వారా సామర్థ్యాలను పెంచే విధంగా ముందుకు సాగుతున్నారు.

3, 6, 9 తరగతుల విద్యార్థులకు..

జాతీయ స్థాయిలో నవంబర్ 19వ తేదీన 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సర్వే టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో ప్రాథమిక -347, ప్రాథమికోన్నత-66, ఉన్నత- 127 పాఠశాలలు ఉండగా, 3, 6, 9 తరగతుల్లో 9,340 మంది విద్యార్థులు ఉన్నారు. ఎన్‌ఏఎస్‌లో వచ్చే ప్రశ్నల సరళి, సబ్జెక్టుల వారీ విద్యా సామర్థ్యాలు, విద్యార్థుల్లో సాధించాల్సిన అభ్యసన ఫలితాలు, ప్రశ్న పత్రంపై ప్రతీ సబ్జెక్టు ఉపాధ్యాయుడికి జిల్లా, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలతో సంపూర్ణ అవగాహన కల్పించారు. ఎన్‌ఏఎస్‌లో జనగామ జిల్లా దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్‌ఎంల పర్యవేక్షణలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక ఫోకస్ సారిస్తున్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే టాలెంట్ టెస్ట్‌కు ఉపాధ్యాయుల హాజరు శాతం పూర్తి స్థాయిలో ఉండే విధంగా మండల నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను ప్రతీ వారం రెండు స్కూల్స్‌ను విధిగా పర్యవేక్షించాలి. అలాగే ప్రతీ వారం స్లిప్ టెస్ట్‌లను నిర్వహించి, ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించాలి. ఇందులో వెనక బడిన పిల్లలతో ప్రతిభావంతులను కలిపి రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలి.

ఆగస్టు 31న మాక్ టెస్ట్

జాతీయ స్థాయిలో నవంబర్ 19న జరిగే సర్వే టాలెంట్ టెస్ట్‌కు సన్నద్ధంలో భాగంగా ఈ నెల 31వ తేదీన జిల్లాలో మాక్ టెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ గ్రూప్ ఉపాధ్యాయులతో జిల్లా స్థాయిలో రూపొందించిన ఎన్‌ఏఎస్ మాదిరి ప్రశ్న పత్రాల సాఫ్ట్ కాపీలను అన్ని పాఠశాలలకు పంపించి విద్యార్థులకు రోజు వారీగా ముందస్తు ప్రాక్టీస్ చేయించడంతో పాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో జనగామ జిల్లా సత్తా చాటుకునే క్రమంలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు వచ్చే అవకాశం ఉంటుంది.

ఉత్తమ ఫలితాల కోసం..



ఈసారి ఎన్‌ఏఎస్‌లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తున్నాం. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలను అనుసరిస్తూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, విద్యార్థుల్లో సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం. ఆగస్టు 31న ముందస్తు మాక్ టస్ట్ నిర్వహించి, నవంబర్ మాసంలో జాతీయ స్థాయిలో జరిగే సర్వే టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులను సన్నద్ధం చేస్తాం.

\- రామ్, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రతీ రోజు మానిటరింగ్..



నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే టెస్ట్ కోసం అహర్నిషలు కష్టపడుతున్నాం. ఎస్‌సీఆర్‌టీ ద్వారా ప్రశ్నా పత్రాలు తయారు చేయిస్తూ, మండల స్థాయిలో మాదిరి ప్రశ్న పత్రాలు తయారు చేసి, రోజు వారీగా పిల్లల్లో ఉన్న జ్ఞానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. 2024 ఎన్‌ఏఎస్‌లో జిల్లా ఉత్తమ ఫలితాలు వస్తాయనే నమ్మకం ఉంది.

-బొమ్మెనబోయిన శ్రీనివాస్,
జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

నేడు శ్రీ కృష్ణ జన్మాష్టమి

జనగామ: నేడు (సోమవారం) శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకునేందుకు ఆలయాలతో పాటు బాలభారతి, శ్రీమత్ భగవద్గీతాశ్రమం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసంలో వచ్చే శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా వేడుకలను అట్టహాసంగా జరుపుకుంటారు. .

పురవీధుల్లో ఉట్టికొడుతూ...

శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని నేడు శ్రీకృష్ణమందిరంతో పాటు ఆలయాలు, శ్రీ వైష్ణవులు, భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. ఊయల కట్టి అందులో శ్రీ కృష్ణ విగ్రహాన్ని పడుకోబెట్టి.. పాటలు, సంకీర్తనలు పాడుతూ ఆరాధిస్తారు. పళ్లు, అటుకులు, వెన్న, పెరుగు మీగడను స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. పురవీధుల్లో ఉట్టి కట్టి పోటీపడి వాటిని కొడతారు.

నేడు పోటీలు..

జనగామ పట్టణం హైదరాబాద్ రోడ్డులోని ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో బాలభారతి ఆధ్వర్యంలో నిర్వాహకులు త్రిపురారి సూర్యప్రసాద్‌పద్మ పర్యవేక్షణలో శ్రీ కృష్ణా ష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. అలాగే సిద్దిపేటరోడ్డులోని గీతానగర్‌లో శ్రీమత్ భగవద్గీతాశ్రమంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని సాంస్కృతి కార్యక్రమాలతో పాటు చిన్నారుల వేషధారణలతో పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కొడిపాక ప్రభాకర్, ఆలయ ప్రధాన పూజారి ఎం.రాజేశ్వర్ భార్గవ తెలిపారు. కాగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలతో పాటు ఆలయాల్లో ముందస్తు కృష్ణాష్టమి పండుగను జరుపుకున్నారు.



కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

ముగిసిన చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండ మాదిరెడ్డికుంట రోజరీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అండర్-9 చెస్ పోటీలు ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు స్కూల్ డైరెక్టర్ అల్లం సునీల్‌రెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికల విభాగంలో నలుగురు, బాలుర నుంచి నలుగురు క్రీడాకారులు త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కన్నా వివరించారు.

పంచరాయి భూములు పేదలకే పంచాలి

జనగామ రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ పంచరాయి భూములు పేదలకే పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గట్టు మల్లు అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయకార్మికులకు ఏడాదికి రూ. 12 వేలు ఇవ్వాలని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 5వ తేదీన ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల కుమార స్వామి, నకీర్త రాములు, బంటు పాండు, దండుగుల ఐలయ్య, బోళ్ల యాదగిరి, సీతారాం నాయక్, వెంకటరెడ్డి, అంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

దేవరుప్పుల: సీతారాంపురంలో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



బచ్చన్నపేటలో శివశత్తుల పూనకాలు



వైభవంగా బోనాలు

శ్రావణమాసం సందర్భంగా జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో ఆదివారం వైభవంగా బోనాల పండుగను జరుపుకున్నారు. మహిళలు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు చేరుకుని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు సమర్పించారు.



జనగామ రూరల్: శామీర్‌పేటలో బోనాలతో వెళ్తున్న మహిళలు

లక్నవరంలో పెద్ద త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలి

- టూరిజం కార్పొరేషన్ ప్రచారకర్త రామన్న

గోవిందరావుపేట: లక్నవరం సరస్సు దీవుల్లో శాశ్వత అతి పెద్ద త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలని టూరిజం కార్పొరేషన్ ప్రచారకర్త పులియాల రామన్న అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బుస్సాపూర్ సమీపంలోని కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సులోని రెండు దీవుల్లో టూరిజం శాఖ కాటేజీలు నిర్మించి పర్యాటకులకు అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. మొదటి దీవిని కలుపుతూ జంట వంతెనలు నిర్మించారని, జంట వంతెనల అందం వర్ణించలేమన్నారు. రాష్ట్ర, దేశ, విదేశీ పర్యాటకులు లక్నవరం అందాలు చూసి ముగ్ధులవుతున్నారన్నారు. ఈ క్రమంలో దేశఖ్యాతి, సరస్సు అందాన్ని మరింత పెంచాలంటే లక్నవరం ఐలాండ్‌లో హుస్సేన్‌సాగర్ తరహాలో అతిపెద్ద జాతీయ జెండాను ఏర్పాటు చేయాలన్నారు. అప్పుడే పర్యాటకులను ఆకట్టుకోవడంతో పాటు దేశ ఖ్యాతిని గౌరవించే వారమవుతామన్నారు. అలాగే, సరస్సు గుట్టపై నుంచి మొదటి ఐలాండ్‌కు రోప్ వే కన్వేయర్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత ఆనందం కలుగుతుందన్నారు. జిల్లా అధికారులు ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రామన్న కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్లు దగ్ధం

- ఎస్‌బీఐ తొర్రూరు శాఖలో ఘటన



దగ్ధమైన ఫర్నిచర్

తొర్రూరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో రెండు కంప్యూటర్లలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ఘటనలో స్వల్ప మంటలు చెలరేగి బ్యాంకు మొత్తం పొగతో కమ్ముకుంది. ఈ ప్రమాదం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. ఆదివారం బ్యాంకు సెలవు. అయితే సిబ్బంది బ్యాంకుకు కావాల్సిన పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కంప్యూటర్‌లో పొగలు వచ్చి మరో కంప్యూటర్‌కు వ్యాపించాయి. దీంతో బ్యాంకు నుంచి భారీగా పొగ రావడంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటినా ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పేశారు. ఈ మంటల్లో కొన్ని ఫైల్స్, కంప్లెట్స్ బాక్స్, రెండు కంప్యూటర్లు, కొంతమేరకు ఫర్నిచర్ దగ్ధమైందని బ్యాంకు సిబ్బంది తెలిపారు.

కట్టుబట్టలే మిగిలాయి..



దగ్ధమవుతున్న గుడిసె



కాలిబూడిదైన ఇల్లు, వస్తువులు



రోదిస్తున్న తల్లీకూతురు

- కొత్తమల్లూరులో గుడిసె దగ్ధం
- రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం
- మిన్నంటిన బాధితుల రోదనలు

మంగపేట: సాధారణంగా పండుగ రోజు ప్రతి ఇల్లు కళకళలాడుతుంది. కుటుంబీకులు, బంధువుల ఆటాపాటలతో సందడిగా మారుతుంది. కానీ ఓ ఇంట్లో మాత్రం నవ్వుకు బదులు కన్నీళ్లు.. సంతోషానికి బదులు విషాదం నెలకొంది. దీనికి కారణం అగ్ని ప్రమాదం. ఈ ఘటనలో ఇల్లు(గుడిసె) పూర్తిగా దగ్ధమైంది. సర్వం అగ్నికి ఆహుతైంది. కేవలం కట్టుబట్టలే మిగిలాయి. దీంతో బాధితుల రోదనలు మిన్నంటాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొత్తమల్లూరు గ్రామానికి చెందిన రెబ్బల రాములు, రమాదేవి దంపతులు నిరుపేదలు. కూలి పని వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. రాములు కూలి పనికి వెళ్లగా రమాదేవి తన కుమార్తె కల్యాణి బోనం ఎత్తుకుని ఆలయానికి వెళ్లారు. కొంత సమయం తరువాత ఇంటి నుంచి మంటలు వస్తున్నాయని ఇరుగు పొరుగువారు కేకలు వేశారు. దీనిపై సమాచారం అందుకున్న మహిళలు, గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ఇంటి దగ్గరకు వెళ్లారు. అప్పటికే మంటలు తీవ్ర కావడంతో ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఇంట్లోని బీరువాలో దాచిపెట్టిన రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, సుమారు 25 తులాల వెండి పట్టీలు, రూ. 90 వేల వరకు నగదుతో పాటు టీవీ, మంచాలు, బియ్యం, బట్టలు, గృహోపకరణాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. దీంతో సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు రాములు, రామాదేవి దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. తాము ఇప్పుడెలా బతకాలని గుండెలు బాదుకుంటూ తల్లీకూతుళ్లు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. తాను డిగ్రీలో చేరందుకు సిద్ధం చేసుకున్న టెన్త్ మెమో, ఇంటర్ సెకండియర్ సర్టిఫికెట్, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు అన్ని గద్దమయ్యాయని, ఇప్పుడు తన పరిస్థితి ఏమిటని కుమార్తె రోదించిన తీరు అందరిని కలిచి వేసింది. కాగా, ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? లేదా మరే ఇతర కారణం వల్ల జరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

రూ. 5వేల ఆర్థిక సాయం..

కూలీ పనులే ఆధారంగా జీవనం సాగిస్తూ అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలే మిగిలిని నిరుపేద బాధిత కుటుంబానికి ఎస్సై టీవీఆర్ సూరి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. అగ్నిప్రమాద విషయం తెలుసుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు.

కేయూలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కేయూలో లైబ్రరీ వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీలోని కేంద్ర గ్రంథాలయం, ఇతర ప్రాంతాల్లో టాయ్‌లెట్స్, వాష్‌రూమ్‌లు, రెస్ట్ రూమ్‌ల ఏర్పాటుకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. వర్సిటీ అభివృద్ధి అధికారి ఎస్. వాసుదేవరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో మొత్తం 10 టాయ్‌లెట్స్ బ్లాక్‌లు ఒక్కొక్క బ్లాక్ రూ 10.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంలో యూనివర్సిటీ ఇంజనీర్ పొన్నాల రామయ్య, లైబ్రరీ అసిస్టెంట్లు తేజావత్ జావేర్, ఐజాక్ ప్రభాకర్, డాక్టర్ రవిశంకర్, బిల్డింగ్ డివిజన్ బాధ్యులు తేజావత్ జావేర్, ఇజాక్ సుధాకర్, రవిశంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అన్నిపనులకు ఒకే చోట లైబ్రరీ వద్ద శంకుస్థాపన చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.12లక్షల నగదు, 11 తులాల బంగారం అపహరణ
- నర్సంపేటలో ఘటన



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.. పట్టణంలోని వరంగల్ రోడ్డు వివేకానంద కాలనీకి చెందిన మేదవరపు కమలాకర్‌రావు నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఆదివారం తెలవారుజామున ఇంటికి వచ్చి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి బీరువా చూడగా అందులోని రూ. 12 లక్షల నగదు, 11 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. క్లూస్ టీం, జాగీలాలతో ఇల్లు, చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. అనంతరం బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆరు టన్నుల నల్లబెల్లం పట్టివేత



నల్లబెల్లం లోడ్‌తో పట్టుకున్న వ్యాన్‌ను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గూడూరు: మండలంలోని దుబ్బగూడెం, చిల్ల గండితండాల్లో నిర్వహించిన దాడుల్లో ఆరు టన్నుల నల్లబెల్లంతో పాటు 2 వందల కిలోల పటిక, 60 లీటర్ల గుడుంబా పట్టుకుని ఓ వ్యాన్, ఆటో, రెండు బైక్‌లు సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎన్. భిక్షపతి ఆదివారం తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి కొమ్ముగూడేనికి భూక్య బావ్‌సింగ్, లైన్‌తండాకు చెందిన బానోతు దేవ్, అజ్మీరా సూర్య, దుబ్బగూడేనికి చెందిన అజ్మీరా చిన్న, లక్ష్మణ్‌తండాకు చెందిన లావుడ్య బాలు, చిల్లగండితండాకు చెందిన గుగులోతు జ్యోతి, ఏపీలోని కడప జిల్లాకు చెందిన మీసాల వెంకటరమణ, డెరంగుల శివకుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుళ్లు సుధాకర్, నరేశ్, వెంకన్న, బాలకృష్ణ, దేవేందర్, యుగేంధర్, గద్దర్, సాయిరామ్, మనోజ్, మల్లికార్జున్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫేక్ నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలింపు

- లారీని సీజ్ చేసిన పోలీసులు



ఫేక్ నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండలంలోని ఒంటిచింతలగూడెం ఇసుక ర్యాంప్ నుంచి ఫేక్ నంబర్ ప్లేట్ అమర్చుకుని ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల చెందిన నేనావత్ సురేశ్, పట్లావత్ శ్రావణ్ ఒంటి చింతలగూడెం ఇసుక ర్యాంప్ నుంచి ఫేక్ నంబర్ ప్లేట్‌తో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారు. దీనిపై టీఎస్‌ఎండీసీ అధికారుల సమాచారం మేరకు మండల కేంద్రంలోని శివాలయం వద్ద వాహన తనిఖీల్లో లారీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పట్టుకున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు పేర్కొన్నారు.

సమాజ చైతన్యంలో ముందుండాలి



కిరణ్మయి రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభివాణి, గ్రంథాలయ చైర్మన్ ఎండీ. రియాజ్

- ఎమ్మెల్సీ సురభివాణి

విద్యారణ్యపురి : కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యపరచడంలో ముందుండాలని ఎమ్మెల్సీ సురభివాణి అన్నారు. భాషోపాధ్యాయురాలు రావుల కిరణ్మయి రచించిన బొడ్రవుతు కథా సంపుటిని, పీవీ నర్సింహారావు ఉయ్యాల పాటపుస్తకాన్ని చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీవేదిక ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిరోడ్డులోని పీఆర్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సురభివాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కిరణ్మయి ఉయ్యాల పాట రూపంలో పీవీ చరిత్ర రాయడం గొప్ప ప్రయోగమన్నారు. కిరణ్మయి ఆలోచన విధానాన్ని ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఎండీ. రియాజ్ పీవీ నర్సింహారావు అనుసరించిన విధానాలు, సేవలను కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బొడ్రవుతు కథల్లో రచయిత రాసిన అనేక సామెతలను ప్రస్తావిస్తూ ఆమెకు పల్లెజీవితంపై తెలంగాణ భాష, యాసపై పట్టును కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత బీవీఎస్ స్వామి బొడ్రవుతు కథా సంపుటిని సమీక్షించారు. కవయిత్రి, హిందీ స్కూల్ అసిస్టెంట్ మెరుగు అనురాధ పీవీ నర్సింహారావు ఉయ్యాల పాట పుస్తకాన్ని సమీక్షించారు. సమావేశానికి చక్రవర్తుల సాహితీవేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ప్రముఖ నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, జానపద విజ్ఞానవేత్త, తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య భక్తవత్సలరెడ్డి, కరీంనగర్‌లోని పీవీ సాహిత్యపీఠం అధ్యక్షుడు కల్వకోట వెంకట సంతోశ్‌బాబు, కవి, రచయిత నంది పురస్కార గ్రహీత రావుల పుల్లాచారి, నిర్వాహకులు తెలుగు స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ఆభరణాల బహూకరణ



దుర్గామాతకు ఆభరణాలు అందజేస్తున్న కొండా మురళి

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లిలోని విష్ణుదుర్గామాతకు ఆదివారం కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి బంగారు ఆభరణాలను బహూకరించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, దుర్గామాత ఆలయ చైర్మన్ కేశిరెడ్డి ప్రత్యూష, బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డికి గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 8 లక్షల విలువైన బంగారు హారం, పుస్తెలు, కమ్మలు ఉదయం హనుమకొండ నుంచి కొండా మురళి తీసుకురాగా ఆయనకు ఘనస్వాగతం పలికారు. కోలాటం, డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు.

ఎమ్మెల్యే శ్రీహరి నన్ను ఇబ్బంది పెట్టలేదు : మురళి

ఆలయంలో మొక్కులు తీర్చుకున్న అనంతరం కొండామురళి మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు గ్రామప్రజలకు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తమను ఇబ్బంది పెట్టలేదన్నారు. గుళ్లు, గోపురాలకు రాజకీయాలకతీతంగా ఇప్పుడే కాదు ఎప్పటి నుంచో ఎవరు పిలిచినా వెళ్తున్నామని, ఎక్కడైనా తమ తల్లిదండ్రుల పేర విరాళాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రంగు హరీశ్, ఉడుత వెంకన్న, గొంగిడి కృష్ణమూర్తి, గడ్డం సిద్ధయ్య, కావటి రాజు, కొయ్యడ రాందాసు, తదితరులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు



గంగదేవిపల్లిలో విద్యార్థులు

గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శగ్రామం గంగదేవిపల్లిని కాకతీయ యూనివర్సిటీ దూర విద్యలో మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్(ఎంఎస్‌డబ్ల్యూ) మొదటి సంవత్సరం చదువుతున్న 11 జిల్లాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఆదివారం సందర్శించారు. కె. సంపత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అభివృద్ధి తీరు తెన్నులను పరిశీలించారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, రిసోర్స్ పర్సన్ గూడ సరోజన వారికి గ్రామ వివరాలు, అభివృద్ధి గురించి వివరించారు.

కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి?

వరంగల్: ఏనుమాముల ప్రాంతానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కాశిబుగ్గకు చెందిన ఒక సీనియర్ ప్రజాప్రతినిధి సామాజిక వర్గానికి చెందిన ముఖ్య అనుచరుడు భూ క్రయవిక్రయాలు చేస్తుంటాడు.ఈ భూముల్లో ఎక్కువ వివాదాస్పదం, ప్రభుత్వ ఆక్రమిత స్థలాలు ఉండడంతో సదరు కాంగ్రెస్ నాయకుడు జోక్యం చేసుకోవడంతో ఇరువురు (ప్రజాప్రతినిధి, ముఖ్య అనుచరుడు) ఒక ఒప్పందానికి వచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఏనుమాముల, కాశిబుగ్గ ప్రాంతాల్లోని ఇందిరమ్మ కాలనీ, ఎస్ఆర్‌నగర్, బాలాజీనగర్, చాకలి ఐలమ్మ కాలనీల్లో ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివాదాస్పదమైన భూముల విక్రయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల పలువురు బాధితుల ఫిర్యాదుల మేరకు ముఖ్యనేత 14 డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలు అప్పగించకుండా దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ భూముల విక్రయాల సందర్భంగా ఆర్థిక పరమైన లావాదేవిల్లో వచ్చిన తేడాలతో ఇరువురు (ప్రజాప్రతినిధి, ముఖ్య అనుచరుడు) రెండు రోజులు క్రితం ఓ బార్ షాపులో గొడవపడినట్లు తెలిసింది. ఒకరిపై మరొకరు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసారనే ప్రచారం జరిగింది. ఈవిషయంపై ఏనుమాముల పోలీసులను వివరణ కోరగా బార్ షాపు వద్ద స్వల్పంగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసిందని, ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

జీవితంపై విరక్తిచెంది.. యువకుడి ఆత్మహత్య



ప్రేమ్‌కుమార్(ఫైల్)

దామెర: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దుర్గంపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఊరుగొండ ప్రేమ్‌కుమార్ (28) ఓ బ్యాంకులో క్రెడిట్ కార్డు సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. 2020లో వివాహం కాగా భార్యతో విభేదాలు తలెత్తి ఈ నెల 13న పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. ఈ అంశంపై ప్రేమ్‌కుమార్ కొన్ని రోజుల నుంచి మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనం చేసిన అనంతరం కుటుంబీకులతో కలిసి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున తల్లి లేచిచూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో కేకలు వేయగా ఇరుగుపొరుగువారువచ్చి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రేమ్‌కుమార్ తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

విష జ్వరంతో చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

కొత్తగూడ: విష జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వేలుబెల్లి శివారు హనుమాన్‌తండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భుక్యా రాజేందర్, సంధ్య దంపతుల కుమార్తె రూప(18 నెలలు)కు రెండు రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా తగ్గకపోవడంతో ఆదివారం మళ్లీ తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే ఎంజీఎం తరలించాలని సూచించారు. దీంతో ఎంజీఎం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. రూప మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పాయబాటలులో వ్యక్తి..



నారాయణ(ఫైల్)

వాజేడు: మండలంలోని పాయబాటలు గ్రామానికి చెందిన అల్లి నారాయణ(43) జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. నారాయణకు ఐదు రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఏటూరు నాగారంలో వైద్యం చేయించినా తగ్గకపోవడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళ..

కాశిబుగ్గ : గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్ కథనం ప్రకారం.. హనుమకొండ లష్కర్ బజార్‌కు చెందిన సాధియా(42) నాలుగు సంవత్సరాల నుంచి సికింద్రాబాద్ లాలాగూడలో కుమారుడు సల్మాన్, కూమార్తె సల్మాతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో శనివారం గుర్తుతెలియని రైలులో వస్తుండగా జారి పడి మృతి చెందింది. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి తల్లి రహమతున్నీషా బేగంకు అప్పగించామని ఎస్సై మొయినొద్దీన్ ఆదివారం తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు..



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

దామెర: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన దామెర పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. మండల కేంద్రం సమీపంలోని శ్రీహర్ష పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొనగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడు 35 సంవత్సరాల వయసు ఉండి చామన్ ఛాయ కలిగి ఉన్నాడు. 5 అడుగుల 6 అంగుళాలు సన్నగా కోల మొహంతో ఉన్నాడు. గడ్డంతో నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చూరీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 8712685228, 8712685020, 8712685226 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.

సాకులు చెప్పకుండా రుణమాఫీ చేయాలి

కమ్యూనిస్టులు కావాలని ప్రజల కోరిక

- పార్టీ మారితే క్రిమినల్ యాక్షన్ ఉండాలి
- బీఆర్‌ఎస్ మనుగడకోసం పోరాటం
- విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : రైతులకు ఇచ్చిన హామీ మేరకు సాకులు చెప్పకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండలోని హరితకాకతీయలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు శనివారం ముగిశాయి. ఆదివారం హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ఉండాలనే భావన ప్రజల్లో ఉందన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటే ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తారని వరంగల్ పోరుగడ్డలో మూడు రోజుల పాటు జరిగిన పార్టీ నిర్మాణ సమావేశాల్లో దేశ, రాష్ట్ర పరిస్థితులు చర్చకు వచ్చాయన్నారు. ప్రజల్లో పాలక పక్షాలపై ఉన్న అసంతృప్తిని గుర్తించి కమ్యూనిస్టు పార్టీగా పోరాట పంథాను ఏ విధంగా తీసుకెళ్లాలనే చర్చ జరిగిందన్నారు. ఇటీవల ఒక పార్టీలో గెలిచిన వారు మరో పార్టీలో చేరి ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్నారన్నారు. పార్టీ మారితే పదవి ఊడే విధంగా క్రిమినల్ యాక్షన్ ఉండాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన 'హైడ్రా'కు మద్దతు తెలుపుతున్నామని, పేదల జోలికి వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ మనుగడకోసం పోరాటం చేస్తూ ఇబ్బందులు పడుతోందని, ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారన్నారు. సెప్టెంబర్ 2న దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా అధికదరలపై ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు 'తెలంగాణ సాయుధ పోరాటం-కమ్యూనిస్టుల పాత్ర' అనే అంశంపై వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కాగా, నిర్మాణ సమితి సమావేశాల్లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా వరంగల్‌కు చెందిన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మేడ్చల్‌కు జిల్లాకు చెందిన బాలమల్లేశ్‌ను ఎన్నుకున్నారు.